క్లుప్తంగా...

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.41, నల్లవంకాయ 35, పొడుగు వంకాయ 35, బెండకాయ 40, పచ్చిమిర్చి 75, బజ్జీమిర్చి 55, క్యాప్సికమ్ 65, పచ్చకాకర 38, పందిరిబీర 40, క్యాబేజీ 13, క్యారెట్ 50, దొండ 23, గుండుబీన్స్ 105, గింజ చిక్కుడు 85, గోకరకాయ 45, కీర 28, దోసకాయ 15, బీట్‌రూట్ 28, ఉల్లిగడ్డ 16, ఆలుగడ్డ 21, చామగడ్డ 35, మొరంగడ్డ 15, కందగడ్డ 35, సొరకాయ 11, పొట్లకాయ 18, అరటికాయ 11, మునగకాయ 3–4, ముల్లంగి 4–6. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

ఆర్థికసాయం అందజేత

చిలకలగూడ : కేన్సర్‌తో బాధపడుతున్న బీజేపీ కార్యకర్తకు మాజీ మేయర్ బండా కార్తీక చంద్రారెడ్డి ఆర్థిక సాయం అందించారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకుని సికింద్రాబాద్ నియోజకవర్గంలో గురువారం పలు సామాజిక సేవ కార్యక్రమాలు నిర్వహించారు. సీతాఫల్‌మండికి చెందిన బీజేపీ కార్యకర్త కేన్సర్ బారినపడి ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నట్లు తెలుసుకున్న ఆమె స్వయంగా బాధితుడి ఇంటికి వెళ్లి ఆర్థిక సాయం అందించి, మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వరరెడ్డి, వీరన్న, నరహరి పాల్గొన్నారు.

డివిజన్‌ను అభివృద్ధి చేస్తాం



పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి

అడ్డగుట్ట: డివిజన్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి పరుస్తామని కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి పేర్కొన్నారు. తుకారాంగేట్ సాయినగర్‌లో తాగునీటి పైప్‌లైన్ పనులకు గురువారం ఆమె శంకుస్థాపన చేసి మాట్లాడారు. ప్రజా సమస్యల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎప్పటికప్పుడు సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్పొరేటర్ వెంట లింగాని శ్రీనివాస్, సత్తయ్యగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, ఎల్లయ్య, మనోహర్, రాజు, వసంత, అమర్, గౌస్, నర్సింగ్, రవి, రామస్వామి ఉన్నారు.

భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు



సమావేశంలో పాల్గొన్న అన్నపూర్ణ

అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ కల్యాణ మహోత్సవానికి వచ్చే భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, ఆలయ కార్యనిర్వాహణ అధికారి ఎస్.అన్నపూర్ణ తెలిపారు.గురువారం ఆలయ ప్రాంగణంలో ఆలయ చైర్మన్ సాయిబాబా గౌడ్, పాలక మండలి సభ్యులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కల్యాణానికి దాదాపుగా 12 లక్షల వరకు భక్తులు వచ్చే అవకాశముందన్నారు. మంత్రి తలసాని ఇది వరకే అన్ని శాఖల అధికారులతో కో ఆర్డినేషన్ సమావేశం పెట్టి ఏర్పాట్లపై సమీక్షించారని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చారన్నారు. వీఐపీ పాసులు మినహా ఎలాంటి పాసులు జారీ చేయడం లేదని ఒక్క పాసుపై ఇద్దరిని మాత్రమే అనుమతిస్తారన్నారు. వీఐపీ పాస్‌లు ఉన్న వారు మధ్యాహ్నం 2 గంటల లోపు దర్శనం పూర్తి చేసుకోవాలని కోరారు.

ఓయూలో 'భట్టి' పుట్టిన రోజు వేడుకలు



ఉస్మానియా యూనివర్సిటీ: కాంగ్రెస్ పార్టీ నుంచి తెలంగాణకు కాబోయే సీఎం భట్టి విక్రమార్క అని ఓయూ విద్యార్థి జేఏసీ అధ్యక్షులు లోకేష్‌యాదవ్ అభిప్రాయపడ్డారు. గురువారం ఓయూలో సీఎల్పీ నాయకులు భట్టి విక్రమార్క జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ రాబోవు ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని 9 ఏళ్లకే దశాబ్ది ఉత్సవాలను నిర్వహించడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజా సమస్యలను స్వయంగా తెలుసుకునేందుకు మండుటెండలో పీపుల్స్ పాదయాత్ర చేపట్టి పేద బడుగు బలహీన, ఆదివాసీ వర్గాలు, రైతులు, నిరుద్యోగులు, వ్యాపారుల బాధలకు చలించిపోయారన్నారు. వేయి కిలోమీటర్ల భట్టి పాదయాత్ర రాష్ట్ర రాజకీయాలలో పెనుమార్పును సృష్టించనుందన్నారు. వికాస్‌యాదవ్, వినోద్‌గౌడ్, రాముగౌడ్, మహేష్‌యాదవ్, శ్రీనివాస్, చందు, మనోహర్ పాల్గొన్నారు.

బోనాల పండగ వైభవంగా చేసుకుందాం

మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి బోనాల పండుగ అందరిదని అందరూ కలిసి అంగరంగ వైభవంగా నిర్వహించుకుందామని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. పండుగలో ఎలాంటి రాజకీయాలు ఉండవని అమ్మవారిపై భక్తితో లక్షల మంది వివిధ ప్రాంతాల నుంచి వస్తారని వారందరికి సులభంగా అమ్మవారి దర్శనం అయ్యేలా అందరూ సేవ చేయాలని పిలుపునిచ్చారు. వచ్చే నెల 9,10వ తేదీల్లో జరుగనున్న ఉజ్జయినీ మహంకాళి బోనాల జాతర ఏర్పాట్ల గురించి గురువారం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్ని శాఖల అధికారులతో దేవాలయం వద్ద సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ బోనాల ఉత్సవాల కోసం నగరంలో ఉండే ప్రైవేటు దేవాలయాలకు ఇచ్చేందుకు రూ.15 కోట్లు ఈ పాటికే విడుదల చేశారని ఉత్సవాలకు ముందే వీటిని పంపిణీ చేస్తామన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాకే రాష్ట్ర ఉత్సవాలుగా ప్రకటించి ఎంతో వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. బోనాలతో వచ్చే మహిళా భక్తులకు ఇబ్బందులు లేకుండా అవసరమైతే క్యూ లైన్ల సంఖ్య పెంచాలని సూచించారు. ఫలహార బండ్ల ఊరేగింపునకు అనేక రకాల నిబంధనల చూపించి అనుమతుల్లో జాప్యం కాకుండా చూడాలన్నారు. నిర్వాహకులు కూడా సాయంత్రం 7 గంటలకు ఊరేగింపు మొదలు పెట్టి 12 గంటలకు ముగిస్తే ఎంతో మంది ప్రజలు కూడా చూసి ఆనందిస్తారన్నారు.

అదనంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి..

సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయో లేదో పరిశీలించి అదనంగా మరికొన్ని ఏర్పాటు చేసికోవాలని పోలీసులను ఆదేశించారు. లోపలికి వెళ్లిన భక్తులు బయటకు వచ్చేందుకు మూడు ద్వారాలు ఏర్పాటు చేస్తే సులభంగా ఉంటుందన్నారు. దేవాలయం చుట్టూ పక్కల రోడ్ల మరమ్మతులతో పాటు 24 గంటలకు శానిటేషన్ సిబ్బందితో పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తామని జీహెచ్‌ఎంసీ కమిషనర్ లోకేష్ కుమార్ తెలిపారు. జలమండలి ఎండీ దానకిశోర్ మాట్లాడుతూ.. భక్తులకు 7 లక్షల మంచినీళ్ల ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లు సిద్ధంగా ఉంచుతామన్నారు. మంచినీళ్లు, డ్రైనేజీ సమస్యలు లేకుండా చూస్తామని దీని కోసం నిధులు కూడా విడుదల చేశామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీ చందనాదీప్తి, దేవదాయ శాఖ అదనపు కమిషనర్ జ్యోతి, ఆర్‌జేసీ రామకృష్ణ, ఈవో మనోహర్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీవో వసంతకుమారి, ట్రాఫిక్ అదనపు డీసీపీ రంగారావు, ఏసీపీ గంగారెడ్డి, డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ వెంకటి పాల్గొన్నారు.



హాజరైన ప్రజలు, భక్తులు

- బీఆర్‌ఎస్ నాయకులు నరసింహారావు ముదిరాజ్ మాట్లాడుతూ.. రెజిమెంటల్‌బజార్‌లో ప్రతి దేవాలయం వద్ద మురుగు నీరు ప్రవహిస్తుందని మంత్రి దృష్టికి తెచ్చారు. వెంటనే ఆయన ఆగ్రహం వ్యక్తం చేస్తూ గాలి మాటలు మాట్లాడవద్దని అన్ని చోట్ల మురుగు నీరు ప్రవహిస్తుంటే తాను తన పదవికి రాజీనామా చేస్తానని అన్నారు. ఎక్కడెక్కడ మురుగు నీరు ప్రవహిస్తుందో తన దృష్టికి తేవాలని సూచించారు. అలాగే వివిధ సంస్థలకు చెందిన ప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు, భక్తులు పలు సమస్యలను, సూచనలు మంత్రి అధికారుల దృష్టికి తెచ్చారు.

'చలో హైదరాబాద్' సభను జయప్రదం చేయాలి



సమావేశంలో పాల్గొన్న వివిధ సంఘాల నాయకులు

అడ్డగుట్ట: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ సాధనకై నిర్వహించనున్న మాదిగ, ఉప కులాల 'చలో హైదరాబాద్' మహాసభను విజయవంతం చేయాలని ఎంఎస్‌ఎఫ్ జాతీయ కార్యదర్శి పల్లెర్ల సుధాకర్ పిలుపునిచ్చారు. గురువారం అడ్డగుట్టలోని ఆజాద్ చంద్రశేఖర్ నగర్‌లో ఎంఎస్‌పీ, ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌ఎఫ్‌ల ఆధ్వర్యంతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లెర్ల సుధాకర్ మాట్లాడుతూ.. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం మందకృష్ణ మాదిగ నాయకత్వంలో 29 ఏళ్లుగా అలుపెరగని పోరాటం చేస్తున్నామన్నారు. ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణపై స్పష్టమైన హామీ ఇవ్వకపోగా మోసం చేస్తున్నాయని ఆరోపించారు. జూలై మూడో వారంలో జరిగే 'ఛలో హైదరాబాద్' మహాసభలో మాదిగలు, ఉపకులాలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. విద్యా, ఉద్యోగ, రాజకీయ, సంక్షేమ రంగాలలో మాదిగ, ఉపకులాలకు సమాన ప్రాతినిధ్యం కావాలంటే ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ ఒక్కటే పరిష్కార మార్గమన్నారు. ఈ సమావేశంలో గణేష్, మహేష్, మల్లికార్జున్, రాజశేఖర్, దశరథ్, వెంకటేష్, ఈశ్వర్, వినయ్, సాయి, నాగేందర్, రమేష్ పాల్గొన్నారు.

విద్యార్థినికి చేయూత



ఆర్థికసాయం అందిస్తున్న వెల్లాల రామ్మోహన్

సనత్‌నగర్: నిరుపేద విద్యార్థినికి వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, టీటీడీ ఎల్‌ఏసీ మెంబర్ వెల్లాల రామ్మోహన్ ఆర్థిక చేయూతనందించారు. ఎర్రగడ్డ సుల్తాన్‌నగర్‌లోని శాంతినికేతన్ కళాశాలలో ఇంటర్మీడియేట్ మొదటి సంవత్సరం (సీఈసీ) చదువుతున్న అస్రా సోఫికి అడ్మిషన్ ఫీజు మొత్తాన్ని ఆయన అందించారు. ఈ సందర్భంగా వెల్లాల రామ్మోహన్ మాట్లాడుతూ.. నిరుపేదలకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానన్నారు. మహానేత వైఎస్సార్ అడుగుజాడల్లో నడుస్తూ ఆయన ఆశయాల సాధనకు తనయుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. పేదింట ఉన్నత చదువులు చదివి ఉన్నత ఉద్యోగాల్లో స్థిర పడ్డారంటే అది వైఎస్సార్ పుణ్యమే అన్నారు.

విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించాలి



పాఠ్య పుస్తకాలను అందజేస్తున్న మహేశ్వరి శ్రీహరి

సనత్‌నగర్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని బేగంపేట కార్పొరేటర్ మహేశ్వరిశ్రీహరి అన్నారు. బేగంపేట డివిజన్ పరిధిలోని ఓల్డ్ పాటిగడ్డలోని బండిమెట్ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు గురువారం ఆమె చేతుల మీదుగా పాఠ్య పుస్తకాలను పంపిణీ చేసి మాట్లాడారు. మన బస్తీ–మన బడి కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. విద్యార్థులు నిర్దిష్ట లక్ష్యంతో చదివి ఉన్నత స్థానానికి ఎదగాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన ఎంతో మంది ఉన్నత శిఖరాలను అధిరోహించారని, వారిని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీహరి, శేఖర్‌ముదిరాజ్, అక్బర్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు



సమస్యలు తెలుసుకుంటున్న మర్రి రాజశేఖర్‌రెడ్డి

రసూల్‌పురా: కంటోన్మెంట్ నియోజకవర్గంలో ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం నియోజకవర్గంలోని రసూల్‌పురాలోని పోచమ్మ టెంపుల్ సమీపంలో, ఇంద్రమ్మనగర్ బస్తీల గుండా సాగుతున్న నాలా పూడికతీత పనులు, ఇంద్రమ్మనగర్ పెద్ద రోడ్డు వద్ద మురుగునీటి సమస్యతో పాటు, గన్‌బజార్ పాఠశాల సమీపంలో రోడ్డు మధ్యన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ సమస్య రోడ్డు ప్యాచ్‌వర్క్ సమస్యలతో పాటు పలు బస్తీల్లో పర్యటించి స్థానికులు ఎదురుకుంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యుత్‌శాఖ విభాగం అధికారులతో మాట్లాడి ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి మరోచోట ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని బోర్డు అధికారుల దృష్టికి తీసుకెళ్లి నాలా పూడికతీత పనులు, రోడ్డు ప్యాచ్‌వర్క్ పనులు జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. షేక్ నయిం, మధుకర్, రాజు సింగ్, యాకుబ్, నాగేష్, భిక్షపతి, మహేష్, జుబేద్, ఇషాద్ పాషా, యాదగిరి, లక్ష్మణ్, భాస్కర్ దఫేదార్ సూరి, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

'నిర్లక్ష్యానికి గురవుతున్న యూనివర్సిటీలు'

లాలాపేట: తెలంగాణ రాష్ట్రంలోని యూనివర్సిటీలు పూర్తిగా నిర్లక్ష్యానికి గురవుతున్నాయని తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ (టీజేఏసీ) చైర్మన్ ప్రొఫెసర్ ఇటికాల పురుషోత్తం ఆరోపించారు. గురువారం తార్నాకలోని జేఏసీ కార్యాలయంలో కన్వీనర్ వేణు, రాష్ట్ర కోఆర్డినేటర్ శ్రీనివాస్, హైదరాబాద్ చైర్మన్ శివకుమార్‌లతో కలిసి విలేకరులతో మాట్లాడారు. రిటైర్డు ప్రొఫెసర్లను యూనివర్సిటీలకు వైస్ చాన్సలర్‌గా నియమించడంతో వారు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తుండటంతో యూనివర్సిటీ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని ఆరోపించారు. హైదరాబాద్‌లోని అగ్రికల్చర్ యూనివర్సిటీలో బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాన్ని ఏర్పాటు చేయడంతో పాటు యూనివర్సిటీ అధ్యాపకుల క్వార్టర్స్‌ను ఉచితంగా పోలీసు ఉన్నతాధికారులకు కేటాయించారని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి యూనివర్సిటీలో పోలీసులకు కేటాయించిన భవనాలను వెంటనే ఖాళీ చేయించాలని డిమాండ్ చేశారు.

సమస్యల పరిష్కారానికి పరిశోధనలు అవసరం

ఉస్మానియా యూనివర్సిటీ: సామాజిక సమస్యల పరిష్కారానికి పరిశోధనలు అవసరమని ఐసీఎస్‌ఎస్‌ఆర్ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ రిచా శర్మ అన్నారు. గురువారం ఓయూ ఆర్ట్స్ కాలేజీలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ రిచా శర్మ పరిశోధన ప్రతిపాదన రచన అనుబంధ సమాచారం అనే అంశం పై మాట్లాడారు. దేశంలో ఐసీఎస్‌ఎస్‌ఆర్ పనితీరు, లక్ష్యాలు, సాధించిన విజయాలను ఆమె వివరించారు. పరిశోధనల ప్రాజెక్టులు, ఫెలోషిప్‌లు, ట్రావెల్ గ్రాంట్స్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఢిల్లీ, తమిళనాడు నుంచి ఎక్కువగా పరిశోధన ప్రతిపాదనలు వస్తున్నాయన్నారు. సోషల్‌సైన్స్ డీన్ ప్రొ.స్టీవెన్ సన్, చరిత్ర విభాగం హెడ్ ప్రొ.అంజయ్య, ప్రొ.లావణ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు రాత పుస్తకాల పంపిణీ

రసూల్‌పురా: పేద విద్యార్థులను ప్రోత్సహించేలా శ్రీ గణేష్ ఫౌండేషన్ అనేక సేవా కార్యక్రమాలు చేపడుతోందని ఫౌండేషన్ వ్యవస్థాపకులు, బీఆర్‌ఎస్ నాయకులు శ్రీ గణేష్ పేర్కొన్నారు. గురువారం కంటోన్మెంట్ నియోజకవర్గంలోని రసూల్‌పురా, అన్నానగర్, బొల్లారం కళాసిగూడ, ఆదర్శనగర్, గాంధీనగర్ మారేడుపల్లిలో శ్రీ గణేష్ ఫౌండేషన్ తరపున విద్యార్థులకు రాత పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మల్లేష్, శ్రీను, ప్రేమ్, రామ్, శ్యామ్, హయత్, శరత్, గౌతమ్, ఖలీమ్, శ్రీకాంత్, మహేష్, మణిదీప్ పాల్గొన్నారు.

మడ్‌ఫోర్ట్ ప్రభుత్వ పాఠశాలలో..

రసూల్‌పురా: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పుట్టిన రోజు పురస్కరించుకుని మడ్‌ఫోర్ట్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల్లో గురువారం బీజేపీ నాయకులు మన్నె శ్రీనివాస్‌రాజు ఆధ్వర్యంలో రాత పుస్తకాలు అందజేశారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్ కన్వీనర్ రాజశేఖర్ రెడ్డి పర్యవేక్షణలో కంటోన్మెంట్ నియోజకవర్గంలో పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఆశీర్వాదం, ఉపాధ్యాయులు షద్రక్, ఉమాపతి, ఖదీర్, బీజేపీ నాయకులు సతీష్, కనకరాజు, అరుణ్, ప్రవీణ్, మేఘా, రమేష్, చంద్ర రేఖ, యాదగిరి పాల్గొన్నారు.

వార్డు కార్యాలయాల్లో సమస్యలకు సత్వర పరిష్కారం

- నేటి నుంచి అందుబాటులోకి..
- మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్



దివ్యాంగురాలితో కలిసి దుకాణం ప్రారంభిస్తున్న మంత్రి తలసాని

సనత్‌నగర్: క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల సత్వర పరిష్కారం కోసమే వార్డు కార్యాలయాల ను ఈ నెల 16న (నేడు) ప్రారంభించనున్నట్లు మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. చిరు వ్యాపారుల కోసం అమీర్‌పేటలో 10, సనత్‌నగర్‌లో 18 దుకాణాలు నిర్మించగా వాటిని గురువారం మంత్రి ప్రారంభించి మాట్లాడారు. చిరు వ్యాపారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఈ దుకాణాలు నిర్మించడం జరిగిందన్నారు. జీహెచ్‌ఎంసీ పరిధిలోని వివిధ విభాగాలకు చెందిన అధికారులు ఈ వార్డు కార్యాలయాల్లో అందుబాటులో ఉంటారని ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఎక్కడికో వెళ్లాల్సిన అవసరం లేదని, వార్డు కార్యాలయాల్లోనే ఫిర్యాదు చేసి పరిష్కరించుకోవాలన్నారు. ఈ విధమైన వ్యవస్థ దేశంలో ఎక్కడా లేదని ప్రజలు ఈ వార్డు కార్యాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలో వందల కోట్ల రూపాయల వ్యయంతో అనేక అభివృద్ధి పనులు చేపట్టి దీర్ఘకాలిక సమస్యలను కూడా చాలా వరకు పరిష్కరించడం జరిగిందన్నారు. నిత్యం ఎంతో రద్దీగా ఉండే ఎర్రగడ్డ–ఫతేనగర్–ఫ్లైఓవర్ వరకు ఉన్న రహదారి విస్తరణ చేసి డివైడర్ల నిర్మాణం చేయడంతో వాహనదారులు, ప్రజలు పడుతున్న ఇబ్బందులను తొలగించామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ శేషుకుమారి, జోనల్ కమిషనర్ రవికిరణ్, డీఎంసీ మోహన్‌రెడ్డి, ఈఈ ఇందిర, వాటర్‌వర్క్స్ జీఎం హరిశంకర్, నాయకులు బాల్‌రెడ్డి, సురేష్‌గౌడ్, రాజేష్‌ముదిరాజ్, సరాఫ్ సంతోష్, హన్మంతరావు పాల్గొన్నారు.

నేడు రుద్రహోమం

సనత్‌నగర్: జ్యేష్ఠ మాసం బహుళ త్రయోదశి తదుపరి చతుర్దశి (మాసశివరాత్రి) సందర్భంగా సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానం శివాలయంలో శుక్రవారం ఉ 7.30 గం రుద్రహోమం జరుగుతుందని ఈఓ శ్రీనివాస రాజు ఓ ప్రకటనలో తెలిపారు. సా 6.30 గంటలకు అభిషేకం, ప్రత్యేక అలంకరణ ఉంటాయన్నారు.

ప్రజా సేవకులకు మంచి గుర్తింపు లభిస్తుంది

అడ్డగుట్ట: అంకితభావంతో ప్రజలకు సేవలందించే వారికి మంచి గుర్తింపు లభిస్తుందని లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్ వెంకట్ నారాయణ రెడ్డి అన్నారు. ఇంజినీర్స్ డే ను పురస్కరించుకొని గురువారం సికింద్రాబాద్‌లో లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్స్ 320–సీ క్యాబినెట్ సమావేశం జరిగింది. సికింద్రాబాద్‌లో 2022–23 సంవత్సరంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రజలకు సేవలందించిన వారికి అవార్డులు అందజేసి సన్మానించారు. అందులో భాగంగా లాలాగూడ వర్క్‌షాప్‌కు చెందిన లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ చైర్ పర్సన్ శ్యామ్ రావును ఘనంగా సత్కరించారు. నారాయణ రెడ్డి మాట్లాడుతూ.. లయన్స్ క్లబ్‌లో సభ్యులైన రైల్వే ఇంజనీర్లు సైతం రక్తదాన శిబిరం, పేద విద్యార్థులకు నోట్ బుక్స్, మెడికల్ అవేర్‌నెస్ క్యాంపులు, యువతకు శిక్షణ శిబిరాలు వంటి ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. లయన్ కృష్ణ ప్రసాద్, ఇన్నారెడ్డి, రవీందర్ గుప్తా, కృష్ణారెడ్డి, శేఖర్‌రెడ్డి, సాధు శ్యామ్ ప్రసాద్, శ్రీనివాస్‌రెడ్డి, పెండెం కృష్ణకుమార్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

'వ్యక్తిగత కక్షతోనే ఇబ్బంది పెడుతున్నారు'

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో అధ్యాపకునిగా ఉద్యోగ నియామకానికి రిటైర్మెంట్ తర్వాత నో డ్యూస్ సర్టిఫికెట్ జారీకి సంబంధం లేదని ప్రొ.అన్సారీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేవలం వ్యక్తిగత కక్షతోనే అధికారులు నో డ్యూస్ సర్టిఫికెట్‌ను ఐదు నెలలుగా ఇవ్వకుండా తిప్పించారని, దీక్ష చేయడంతో ల్యాప్‌టాప్ డ్యూస్ ఉందని పేర్కొనడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రస్తుత వీసీ ప్రొ.రవీందర్ గతంలో ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపల్‌గా కొనసాగినప్పుడు తన నిర్ణయాలను వ్యతిరేకించడంతోనే ఇప్పుడు తనను అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నారని ప్రొ.అన్సారీ ఆవేదన వ్యక్తం చేశారు.

ఆరోపణల్లో వాస్తవం లేదు..

ప్రొ.అన్సారీ, అధికారులు పాలక మండలి పై చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ గురువారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. పదవీ విరమణ తర్వాత రావాల్సిన బెనిఫిట్స్ పై ప్రొ.అన్సారీ చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. నిబంధనల ప్రకారం బెనిఫిట్స్ ఇచ్చేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారని కానీ.. ప్రచార, సామాజిక మాధ్యమాలలో ఓయూ అధికారులపై ప్రొ.అన్సారీ తప్పుడు ప్రచారం చేయడం సరికాదన్నారు.

అవినీతిలో కూరుకుపోయిన కేసీఆర్ పాలన

- ప్రకాశ్ జవదేకర్



మాట్లాడుతున్న ప్రకాశ్ జవదేకర్

రాంగోపాల్‌పేట్: తెలంగాణలోని కేసీఆర్ ప్రభుత్వం అవినీతితో కూరుకుని పోయిందని మాజీ కేంద్ర మంత్రి ప్రకాశ్ జవదేకర్ అన్నారు. గురువారం రాత్రి సికింద్రాబాద్‌లోని వెస్లీ జూనియర్ కళాశాలలో సనత్‌నగర్ నియోజకవర్గానికి చెందిన వ్యాపారులు, న్యాయవాదులు, వైద్యులు, వివిధ రంగాల్లోని ప్రముఖులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అవినీతితో పాటు కేసీఆర్ కుటుంబ పాలన సాగిస్తున్నారని విమర్శించారు. మోదీ 9 ఏళ్ల పాలనలో అంతర్జాతీయ స్థాయిలో మనదేశ ప్రతిష్ట పెరగడంతోపాటు అన్ని దేశాలతో సత్సంబంధాలు నెరపడంతో ప్రత్యేక గుర్తింపు లభించిందన్నారు. ఎలాంటి అవినీతి మచ్చ లేకుండా, పారదర్శకమైన పాలన కేంద్రం చేస్తుందన్నారు. ఈ సందర్భంగా ఆయన మోదీ హయాంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వారికి వివరించారు. నాయకులు మర్రి శశిధర్‌రెడ్డి, కార్పొరేటర్లు దీపిక, సుచిత్ర, సరళ, జిల్లా అధ్యక్షుడు బూర్గుల శ్యాంసుందర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి పెద్ది రవీందర్, నాయకులు రాజశేఖర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

'ఏఏఏ సినిమాస్' గొప్ప అనుభూతినిస్తుంది

- అల్లు అరవింద్



సాక్షి, సిటీబ్యూరో: ''ఏఏఏ సినిమాస్'ని సునీల్ నారంగ్ అధునాతన టెక్నాలజీతో రూపొందించారు. సౌత్ ఇండియాలోనే ఎల్‌ఈడీ స్క్రీన్ ఇక్కడ ఉండటం విశేషం. వరల్డ్ క్లాస్ ఫీచర్స్‌తో నిర్మించిన 'ఏఏఏ సినిమాస్'' ప్రేక్షకులకు గొప్ప అనుభూతిని ఇస్తుంది' అని నిర్మాత అల్లు అరవింద్ అన్నారు. అమీర్‌పేటలోని ఏషియన్ సత్యం మాల్‌లో ఏషియన్ సినిమాస్ భాగస్వామ్యంతో హీరో అల్లు అర్జున్ ఏర్పాటు చేసిన 'ఏఏఏ సినిమాస్'ని గురువారం అల్లు అర్జున్ ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా తెలంగాణ రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్మాత, 'ఏషియన్' సునీల్ నారంగ్ మాట్లాడుతూ.. ''ఏఏఏ సినిమాస్' స్క్రీన్ నంబర్ 2లో ఎల్‌ఈడీ స్క్రీన్ ఉంది.. పిక్చర్ చాలా క్లియర్‌గా కనిపిస్తుంది. సౌత్ ఇండియాలోనే ఇది మొదటిది. స్క్రీన్ నంబర్ 1లో హైదరాబాద్‌లోనే అతి పెద్ద స్క్రీన్ ఉంది'' అన్నారు. ఈ ప్రారంభోత్సవ వేడుకలో నిర్మాత 'దిల్' రాజు, బన్నీ వాసు, అభిషేక్ నామా తదితరులు పాల్గొన్నారు.



